క్లుప్తంగా

పాఠశాలకు ఓఎన్‌జీసీ వితరణ



వేండ్ర ఎంపీపీ స్పెషల్ పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామాగ్రి అందజేస్తున్న దృశ్యం

పాలకోడేరు: మండలంలోని వేండ్ర గ్రామంలోని ఎంపీపీ(స్పెషల్) స్కూల్‌లోని విద్యార్థులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఓఎన్‌జీసీ వారి సౌజన్యంతో శనివారం విద్యా సామగ్రి కిట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఓఎన్‌జీసీ ఫీల్డ్ అధికారి ఆమోస్ మాట్లాడుతూ సామగ్రిని సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలన్నారు. కార్యక్రమంలో వేగి రమణ, సాహిత్, ప్రవీణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉండి ఆర్‌ఐగా కార్తీక్



ఆర్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన కార్తీక్‌ను అభినందిస్తున్న రెవెన్యూ అధికారులు

ఉండి: ఉండి మండల నూతన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ)గా ఆర్ కార్తీక్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇదే స్థానంలో ఆర్‌ఐగా బాధ్యతలు నిర్వర్తించి వి.ఆంజనేయులు భీమవరం ఆర్‌డీఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై బదిలీ కావడంతో అదే స్థానంలో పనిచేస్తున్న కార్తీక్ ఉండికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మండల, గ్రామ రెవెన్యూ అధికారులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో మండల వీఆర్వోల అధ్యక్షుడు ఎస్.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



శ్రీవారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి వారి 12 వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీవారి కల్యాణం మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ కమిటి అధ్యక్షులు కంతేటి వెంకట్రాజు, విజయప్రశాంతి దంపతులతో ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు సంప్రదాయబద్ధంగా స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి కార్యదర్శి కుక్కల బాల వెంకటరత్నం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



భీమవరంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా భీమవరం పట్టణంలో శనివారం అగ్నిమాపకాధికారులు భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోన టౌన్ రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, సినిమా థియేటర్స్ షాపింగ్ మాల్స్ తదితర ప్రాంతాల్లో ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణ పద్ధతులపై కరపత్రాలను పంచుతూ అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి సిహెచ్ సూర్య ప్రకాశరావు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌జైల్ సందర్శన

నరసాపురం రూరల్: న్యాయవాదిని నియమించుకునే స్థోమతలేని ముద్దాయిలకు సంస్థ తరపున ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని 1వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కె శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల న్యాయసేవాసంస్థ ఆదేశాల మేరకు ఆయన నరసాపురం సబ్‌జైలును సందర్శించి జైల్ అదాలత్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్, న్యాయవాది గన్నాబత్తుల శివాజీ చక్రవర్తి పాల్గొన్నారు.

ముఖదారమ్మ ఆలయంలో లక్ష మల్లెల పూజ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అచ్చుగట్లపాలెం చిత్రావిచెరువు గట్టున కొలువై ఉన్న శ్రీ ముఖదారమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం రాత్రి లక్ష మల్లెల పూజ కార్యక్రమం నిర్వహించారు. కడియాల శ్రీనివాసు బ్రహ్మత్వంలో బొర్రా ఆదినారాయణ దంపతులు ఈ పూజా కార్యక్రమాలను చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పూజా కార్యక్రమాలు అనంతరం అమ్మవారికి పూజ చేసిన పూలను మహిళలకు అందించారు.

పరిపాలనాదక్షుడు సీఎం జగన్

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



కోపల్లె గడపగడపకు కార్యక్రమంలో లబ్ధిదారులకు బ్రోచర్‌లు అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్



కోపల్లె జగనన్న లేఅవుట్‌లో నూతన గృహ ప్రారంభోత్సవంలో లబ్ధిదారులతో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

కాళ్ల: రాష్ట్ర ప్రజలందరికీ అద్భుతమైన సంక్షేమ పథకాలు అందిస్తూ పరిపాలనాధ్యక్షుడుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మన్ననలు పొందుతున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు.కాళ్ల మండలం కోపల్లె గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నాల్గవరోజు ఎపీపీ పెన్మత్స శిరీష విశ్వనాథరాజు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా గడపగడపకు వెళ్లి ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. ప్రజాబలం జగన్‌మోహన్‌రెడ్డికి ఉందని ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేది జగన్‌మోహన్‌రెడ్డి అని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు ఎవరూ ఊహించని విధంగా నవరత్నాలతో సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజలకు ఆర్థికంగా బలం చేకూరుస్తున్నారని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజలు నిరాజనాలు పడుతున్నారని అన్నారు. సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేయడం ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని ప్రజలే ముందుకొచ్చి చెబుతున్నారని ఆయన తెలిపారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతీ ఒక్కరికీ మేలు జరుగుతుందన్నారు. కోపల్లె గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు.

జగనన్న కాలనీకి వెలుగులు

గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాలలో భాగంగా కోపల్లె గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చేతుల మీదుగా ప్రారంభించారు. దీనిలో భాగంగా గ్రామాల్లో జగనన్న కాలనీలో సుమారు రూ.15 లక్షలతో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన ప్రారంభించారు.జగనన్న లేఅవుట్ సుమారు రూ.14 లక్షలతో నిర్మించిన రహదారిని ప్రారంభించారు. జగనన్న కాలనీలో సుమారు 186 మందికి ఇళ్ల స్థలాలు అందించారు. నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా పీవీఎల్ నర్సింహరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నదూ లేని విధంగా అర్హులైన ప్రతీ పేదవాడికి ఇళ్ల స్థలాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. దీనిలో భాగంగా కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, పెన్మత్స విశ్వనాథరాజు, కోపల్లె, కలవపూడి సొసైటీ అధ్యక్షులు వేగేశ్న జయరామకృష్ణంరాజు, పెన్మత్స దుర్గాప్రసాదరాజు, గణేశ్న రాంబాబు, దంతులూరి కోటేశ్వరరాజు, గోళ్ళ వెంకట సత్యనారాయణ, సొడాబత్తుల వెంకటరత్నం, గుండు నాగేశ్వరరావు, రుద్ర వెంకట్రావు, పెన్మత్స రంగరాజు, వెంకటేశ్వరరావు, బాషా, బొత్స అచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ మూల్యాంకన రేట్లు పెంచాలి

సాక్షి, భీమవరం: పదోత రగతి పరీక్ష పేపర్లు మూల్యాంకనం చేసే ఉపాధ్యాయులకు మూల్యాంకన రేట్లు పెంచాలని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి గోపిమూర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీఎస్ విజయరామరాజు, ఏకేవీ రామభద్రం కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 19 నుంచి పేపర్లు మూల్యాంకనం ప్రారంభమవుతున్నాయని ఉపాధ్యాయులకు ఒక్కోక పేపర్‌కు రూ.6.60 ఇచ్చే రేటును పెంచాలన్నారు. ఎండలు తీవ్రత కారణంగా మూల్యాంకన కేంద్రాల వద్ద ఉపాధ్యాయులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

పేకాట శిబిరంపై దాడి

ఉండి: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో శనివారం పేకాడుతున్నారనే సమాచారంతో ఎస్సై కె.గంగాధరరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.15 వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీన చేసుకున్నారు. నిందుతులపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్'



ఉండిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు



భీమవరంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన దెబ్బకు పారిపోయిన ప్రతిపక్ష నాయకులు ఎన్నికలు వచ్చేస్తున్నాయి కదా ప్రజలను మోసగించేందుకు మోసగాళ్లు మళ్ళీ వచ్చేస్తున్నారంటూ ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ, సర్పంచ్ కమతం సౌజన్య ప్రజలను అప్రమత్తం చేశారు. శనివారం ఉండిలో జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కమతం సౌజన్య, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటంటికీ తిరిగి ఐదు ప్రశ్నల పత్రాన్ని చదివి ప్రజాభిప్రాయాన్ని స్వీకరించారు. యజమానుల అనుమతితో ఇంటింటికీ మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌లు అంటించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుళ్లు, కుతంత్రాలతో ప్రజలను మభ్యపెట్టి రాజకీయాలు చేసి ఓట్లు దండుకోవమే ప్రతిపక్షాల పని అని అన్నారు. కార్యక్రమంలో కమతం బెనర్జీ, గ్రామపార్టీ అధ్యక్షుడు కరిమెరక మల్లికార్జున, కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ చిట్టూరి రత్నరాజు,బడుగు బాలాజీ,రాయి సతీష్,బూసి వాల్టర్‌లాల్,ఆనందరావు,వాసుపల్లి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

భీమవరంలో

సాక్షి, భీమవరం: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను నేరుగా ఇంటివద్దనే లబ్ధిదారులకు అందించే విధంగా పాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని భీమవరం పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ తోట భోగయ్య అన్నారు. 'జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని రెండో వార్డులో మాజీ కౌన్సిలర్ పాలవెల్లి మంగ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతో పాటు అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలో స్థానిక ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. వన్‌టౌన్ వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ నల్లం రాంబాబు, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై అప్రమత్తత అవసరం



భీమవరంలోని టెన్త్ పరీక్షా కేంద్రాల వద్ద కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల రూపంలో జరుగుతున్న దోపిడి, విద్యార్థులపై ఒత్తిడిని వివరిస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ చేశారు. శనివారం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగియడంతో అయా పరీక్షా కేంద్రాల వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు కార్పొరేట్ విద్యా సంస్థలు ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం చేస్తున్న ప్రచారాన్ని వివరించారు. కార్పొరేట్ ఉచ్చులో చిక్కుకుంటే పెద్ద మొత్తంలో ధనం వృథా చేయడమేగాక విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురై పడుతున్న ఇబ్బందులు, అత్మహత్యలను వివరిస్తూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేర్పించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి టి.ప్రసాద్, నాయకులు యు.వినోద్, పి.సుజిత, స్వాతి, పి.మోహిని, బి.గణేష్, బి.దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలకొల్లులో స్వర్ణకారులకు ప్రతిభా పురస్కారాలు

ఆకివీడు: పాలకొల్లులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్వర్ణకార సంఘ సమావేశం, ప్రతిభా పురస్కారాల కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్లుస్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షులు పట్నాల శేషగిరిరావు చెప్పారు. స్థానికంగా శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ స్వర్ణకారులకు పార్లమెంట్‌లో విశ్వకర్మ యోజన పథకం ప్రవేశపెట్టిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి నిర్మాలా సీతరామన్‌లకు అభినందనలు తెలిపే కార్యక్రమం, గడువు ముగిసిన మండల, పట్టణ కమిటీలకు ఎన్నిక, నూతనంగా ఎన్నికైన జిల్లా, మండల సంఘాల పరిచయ కార్యక్రమ అజెండాతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షులు కర్రి వేణుమాధవ్, బీసీ నాయకుడు గూడూరి వెంకట్రావు, జిల్లా కార్యదర్శి నల్లగొండ వెంకట రామకృష్ణ హాజరవుతారని చెప్పారు. సమావేశంలో 10 మంది స్వకర్ణకార వృత్తిలో ప్రతిభ కనబర్చిన వారికి పురస్కార అవార్డులు అందజేస్తామని శేషగిరిరావు వివరించారు.

ప్రత్యేక కారాగారం తనిఖీ



భీమవరం కారాగారంలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జడ్జి ధనరాజు

సాక్షి, భీమవరం: పట్టణంలోని ప్రత్యేక కారాగారాన్ని శనివారం భీమవరం రెండవ అధనపు జూనియర్ సివిల్ జడ్జి డి.ధనరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముద్దాయిల కేసుల వివరాలు పరిశీలించి వారికి రోజువారీ అందిస్తున్న ఆహార పదార్థాల వివరాలను ముద్దాయిలను అడిగి తెలుసుకుని ఆహార పదార్థాలను, వంటశాలను పరిశీలించారు. అనంతరం జడ్జి ధనరాజు మాట్లాడుతూ ముద్దాయిలు క్రమశిక్షణ, పరివర్తన కలిగి బాధ్యతతో ఉండాలని మే 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను రాజీ పడదగిన క్రిమినల్ కేసుల్లో ఉన్న ముద్దాయిలు ఉపయోగించుకోవాలన్నారు. ఆర్థిక స్థోమత లేని వారు మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జైలు ఎర్యవేక్షణ ఇన్‌ఛార్జి అధికారి ఎ కుమార్ స్వామి, కిషోర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నరసాపురం సబ్ కలెక్టర్ ఎం సూర్యతేజ

యలమంచిలి: రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడమే కాకుండా, రైతులకు ఎటువంటి ఆర్థిక భారం లేకుండా ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించడమే రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రధాన కారణమని నరసాపురం సబ్ కలెక్టర్ ఎం సూర్యతేజ చెప్పారు. కలగంపూడి గ్రామంలో 2022–23 రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పంటకు 100 కిలోల ధాన్యానికి కామన్ రకానికి రూ.2040, గ్రేడ్ వన్ రకానికి రూ.2060 చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పొత్తూరి విష్ణుప్రియ జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎం రవికుమార్, నరసాపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈద అనిలకుమారి, తహసీల్దార్ లక్కు నరసింహారావు, మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి పాల్గొన్నారు.

పేకాడుతున్న పది మంది అరెస్ట్

యలమంచిలి: కలగంపూడి గ్రామంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (పాత జిట్స్ కళాశాల) సమీపంలో పాడుబడిన గెస్ట్‌హౌస్‌లో పేకాడుతున్న పది మందిని శనివారం పట్టుకున్నట్లు ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.31,400 నగదు, 10 సెల్ ఫోన్లు, మూడు మోటార్‌బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు.

తేమ శాతం తగ్గేలా ధాన్యం ఆరబెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య

ఆకివీడు: యంత్రాలతో మాసూళ్లు చేస్తున్న రైతులు రబీ ధాన్యంలో తేమ శాతం తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ హాలులో శనివారం ఆర్బీకే ఇన్‌చార్జిలు, రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు తేమ శాతం అధికంగా ఉంటే మద్దతు ధరలో కోత పడే అవకాశం ఉందన్నారు. డెల్టాకు శివారు ప్రాంతంగా ఉన్న ఉండి నియోజకవర్గంలో మాసూళ్లకు మరి కొంత సమయం పట్టే అవకాశం ఉందని చెప్పారు. ఏప్రిల్ 20 వరకూ కాలువలకు నీరు సరఫరా చేస్తారని, గడువుకు మించి నీటి సరఫరా జరగదన్నారు. ఆలస్యంగా నాటులు వేసిన రైతులు కాలువలో నీటిని తోడుకునే ప్రయత్నాలు చేయాల్సి ఉంటుందన్నారు. ఏడీఏ కేఎస్ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ–కేవైసీ నమోదైన రైతులందరి వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరలోనే తెరుస్తారని చెప్పారు. మాసూళ్లు పూర్తి చేసిన వరి చేలల్లో మట్టి నమూనా ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. పంట భూముల్లో సాంద్రత పెంపొందించేందుకు పచ్చిరొట్ట సాగు తప్పని సరి అని ఏడీఏ చెప్పారు. సమావేశంలో ఏఓ ప్రియాంక, ఆర్బీకే ఇన్‌ఛార్జిలు కేశిరెడ్డి దుర్గారావు, ఎరిచర్ల సాంబర్లిస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వామపక్షాల ప్రచారం



భీమవరంలో కేంద్రప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసగా ప్రచారం చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: కేంద్రప్రభుత్వ పాలన నుంచి దేశాన్ని కాపాడుకుందాం.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందామంటూ సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో శనివారం భీమవరం పట్టణం శివరావుపేటలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం కార్యదర్శులు చెల్లబోయిన రంగారావు, ఎం వైకుంఠరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక, మతతత్వ విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, ఆకలి రాము, పాలా త్రిమూర్తులు, ఆంజనేయులు, నాగరాజు, డి త్రిమూర్తులు, నాగేశ్వరరావు, కె కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం అంటూ మహదేవపట్నంలో శనివారం సీపీఐ, సీపీయం ఆధ్వర్యంలో ప్రచార భేరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలను కేంద్ర ప్రభుత్వం కారుచౌకగా అమ్మకం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు, సీపీఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరి

పోడూరు: రైతులంతా తప్పనిసరిగా మట్టినమూనా పరీక్షలు చేయించేలా విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్(వీఏఏ)లు శ్రద్ధ చూపాలని పాలకొల్లు ఏడీఏ ఎ.పార్వతి చెప్పారు. పోడూరు రైతు భరోసా కేంద్రంలో శనివారం మట్టినమూనాల సేకరణపై విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, ఏఈఓ ప్రియాంక పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలంలోని ఆలమూరు రైతు భరోసా కేంద్రంలో మండల స్థాయి భూసార పరీక్షా వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖ అధికారిణి ఎంజేడీ మాధురి భూసార పరీక్ష ఆవశ్యకతను రైతులకు వివరించారు.

రేపటి నుంచి స్వర్ణాంధ్రలో హ్యాకథాన్ సదస్సు

నరసాపురం రూరల్: సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో డేటా సైన్స్ యూజింగ్ పైథాన్ అనే అంశంపై స్వర్ణాంధ్ర హ్యాకథాన్ 2కె23 సదస్సు నిర్వహిస్తున్నామని చైర్మన్ కేవీ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కంప్యూటర్‌సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నుంచి 21 వరకూ నిర్వహించనున్న ఈ సదస్సులో విద్యార్థులు రూపొందించిన డేటాసైన్స్ అప్లికేషన్లు, వెబ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను విడుదల చేస్తామన్నారు. ఐదు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు వివిధ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు హాజరవుతారన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

ఆకివీడు: మండలంలోని చినకాపవరం గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి రత్నం ఇటీవల మోకాళ్ల నొప్పులతో ఆపరేషన్ చేయించుకున్నారు. దీంతో బాధితురాలితో ముఖ్యమంత్రి సహాయ నిధికి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ద్వారా దరఖాస్తు చేయించారు. దీంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి బాధితురాలు రత్నంకు రూ.లక్ష మంజూరు చేశారు. శనివారం చెక్కును అందుకున్న పెద్దిరెడ్డి రత్నం, శ్రీనివాసరావు దంపతులు సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సహకరించిన పీవీఎల్, జెడ్పీటీసీ యండగండి శ్రీను, అన్నవరం తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

గోవిందుడికి లక్ష తులసి పూజ



ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వర స్వామి

ఆకివీడు: స్థానిక మాది వాడలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం లక్ష తులసి పూజ నిర్వహించారు. చతుర్మాసంలో వచ్చే ఏకాదశి సందర్భంగా కంభంపాటి శ్రీనివాసరావు దంపతులు లక్ష తులసి పూజ, కల్యాణం నిర్వహించారు. సుదర్శనం రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ మోటుపల్లి రాజు, భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ చైర్మన్ గునుకుల కొండయ్య పూజా కార్యక్రమాల్ని పర్యవేక్షించారు.

ఎస్పీకి వలంటీర్ ఫిర్యాదు

పాలకోడేరు: గొరగనమూడి గ్రామానికి చెందిన దుర్గ అనే వాలంటీర్ స్థల వివాదం లో కొంతమంది తనను లైంగికంగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ శనివారం జిల్లా ఎస్పీ కు ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఫిర్యాదు పై ఎంక్వైరీ చేయాలని ఎస్పీ రవిప్రకాష్ తనను ఆదేశించారని పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

నేడు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో అన్నసమారాధన

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అన్నసమారాదన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వామివారి సాప్తాహ్నక కల్యాణోత్సవాలు ముగియడంతో ఉదయం 10 గంటల నుంచి ఆలయం వద్ద అన్నదానం చేస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గోడౌన్ల పరిశీలన

నరసాపురం రూరల్: ఈవీఎం మెషీన్లు, వీవీ ప్యాడ్‌లను భద్రపరిచేందుకు అనువైన గోడౌన్లను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం పరిశీలించారు. నరసాపురం మండలం సరిపల్లి పంచాయతీ పరిధిలో గల ఏఎంసీ గోడౌనల్లోల సౌకర్యాలపై ఆమె ఆరా తీశారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ సూర్యతేజ, తహసీల్దార్ ఫాజిల్, ఎంపీడీఓ ఎన్వీ శివప్రసాద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

పోడూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలతోనే మనదేశం, సమాజం అభివృద్ధి చెందుతాయని జైభీమ్ సేవాసమితి(జేబీఎస్ఎస్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మైలాబత్తుల రాజశేఖర్, చింతా సంపత్‌లు పేర్కొన్నారు. పెనుమదం శివారు అప్పిచెరువులోని జేబీఎస్ఎస్ కార్యాలయంలో శనివారం అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో రావి కృష్ణమూర్తి, గొల్ల జనార్ధనరావు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల ప్రారంభం

యలమంచిలి: మేడపాడు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను శనివారం సర్పంచ్ గంటా శాంతకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ పనులు లేని రోజుల్లో కూలీలకు పని కల్పించడంలో ఉపాధిహామీ పనులు చక్కగా ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో తాడి ఇందిర, గుర్రాల వెంకట్రావు, డేగల సూర్యప్రభ, ముద్దల శ్రీనివాస్ పాల్గొన్నారు.

లంకలకోడేరులో

పాలకొల్లు అర్బన్: పనులు లేని వ్యవసాయ కూలీలు ఉపాధి హామీ పథకంలో పనులు చేసుకుని ఉపాధి పొందాలని వైస్ ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వరరావు అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరులో శనివారం ఉపాధి హామీ పథకంలో రూ.3.25 లక్షలతో చేపట్టిన భగ్గేశ్వరం మురుగు కాలువ మరమ్మతుల పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ చొప్పల రజని కూనపరాజు చంటిరాజు, కర్రి జోగయ్య పాల్గొన్నారు.